## ‘సింగరేణి’బకాయిలను వెంటనే చెల్లించాలి




వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

సోమవారం | 23 మార్చి, 2026 | పేజీలు : 06

## వేంకటేశ్వర స్వామి పాదాలను తాకిన సూర్య కిరణాలు



**ప్రజాపక్షం/ తలమడుగు:** తలమడుగు మండలంలోని బరంపూర్ కొండపై వెలసిన పూరాతన శ్రీ లక్ష్మీ గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఒక అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ఉదయం వేళ అర్చకులు స్వామివారికి నిత్యార్చనలు నిర్వహిస్తున్న సమయంలో, సూర్య కిరణాలు నేరుగా గర్భాలయంలోని మూలవిరాట్ పాదాలను తాకాయి. ప్రత్యక్ష దైవమైన సూర్య భగవానుడి కిరణాలు స్వామివారి చరణాలను స్పృశించడాన్ని చూసి భక్తులు భక్తిపారవశ్యంలో మునిగితేలారు. ఈ అపురూప దృశ్యాన్ని భగవత్ కృపగా ఆలయ అర్చకులు అభివర్ణించారు. వైకుంఠ ఏకాదశి, సెలవు దినాల్లో ఆలయం భుక్తులతో కిటకిటలాడుతుందని వారు పేర్కొన్నారు.

## మిషన్ భగీరథ నల్లాల్లో బురద నీరు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- బిందెల అడుగున పేరుకుంటున్న బురద
- ఎలా తాగాలని ప్రశ్నిస్తున్న జనాలు





**ప్రజాపక్షం/ఎడపల్లి:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలో పూర్తిగా కలుషితంగా మారింది. ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి తాగునీటిని అందిస్తున్నారు. గత రెండు రోజులుగా నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీరు మురికిగా మారుతూ తాగడానికి ఏమాత్రం పనికి రాకుండా పోతుంది. మురికితో పాటు బిందెలు, సంపుల్లోని అడుగు భాగంలో మొత్తం బురద పేరుకుంటుంది. మిషన్ భగీరథ పథకంలో భాగంగా నల్లాల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న అధికారులు ఆచరణ లో మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఎడపల్లి మండలంలోని ఏ గ్రామంలో చూసినా స్వచ్ఛమైన తాగునీరు సంగతి దేవుడెరుగు గాని, పూర్తిగా మురికితో కూడిన బురద నీరు నల్లాల ద్వారా సరఫరా అవుతుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బురద నీటిని తామె ఎలా తాగాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మండలంలో ఎక్కడ పడితే అక్కడ పైప్ లైన్లు లీకేజీ కారణంగా బురద నీరంతా మిషన్ భగీరథ, గ్రామ పంచాయతీ పైప్‌లైన్లలోకి వెళ్తుంది. పైప్‌లైన్లలో చేరిన మురికి నీరు, బురద నీరు వాటర్ ట్యాంక్‌లలోకి చేరడంతో గ్రామాలలో నల్లాల ద్వారా నీరు వదిలినప్పుడు బురదనీరంతా నల్లాల ద్వారా ఇళ్లలోకి వస్తుంది. గ్రామాలలో మిషన్ భగీరథ నీరు తాగే వారికి బురద నీరు రావడంతో ప్రజలు ఆ నీటిని తాగలేకపోతున్నారు. నల్లాల ద్వారా వస్తున్న నీరు తాగడానికి వీలు లేకుండా ఉంటుంది. ఈ విషయం మండల ప్రజలు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. లీకేజీలు అరికట్టడంలో గ్రామ పంచాయతీలు, మిషన్ భగీరథ అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే ప్ర జలు ఆరోపిస్తున్నారు.

## కోటి 60 లక్షల రూపాయలతో రాజురాలో చెక్ డ్యాం నిర్మాణం..

### పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్..



**ప్రజాపక్షం/బైంసా :**కుభీర్ మండలంలోని రాజురా గ్రామంలో కోటి 60 లక్షల రూపాయల ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ చెక్ డాం నిర్మాణానికి భూమి పూజ చేశారు.ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి కేసీ ఆర్ చెక్ డ్యామ్ నిర్మాణానికి నిధులు ఇచ్చి టెండర్ల ప్రక్రియ ప్రారంభించనప్పటికి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రమంతా చెక్ డ్యామ్ టెండర్లను నిలిపివేయడం జరిగిందని,ఇక్కడి రైతుల సౌకర్యార్థం టెండర్ క్యాన్సిల్ చేయకుండ ఆమోదం తెలపాలని రాష్ట్ర ప్రభుత్వానికి,నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కి విన్నవించడంతో ప్రభుత్వం అప్రూవల్ ఇచ్చిందన్నారు.ఈ చెక్ డ్యాం నిర్మాణం పూర్తయితే 200 ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగే అస్కారం ఉందన్నారు.సదరు కాంట్రాక్టర్ పనులను నాణ్యత యుతంగా చేయాల్సిందిగా సూచించారు.లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.నియోజకవర్గం లో సాగునీటీ రంగం బాగుపడాలన్న ఉద్దేశంతో ఆ రంగానికి ప్రధాన దృష్టి సారించడం జరిగిందన్నారు.త్వరలో పనులు పూర్తి చేసి,రైతాంగానికి సాగునీరు అందేలా చూడాల్సిందిగా సూచించారు.ఎమ్మెల్యే వెంట మాజీ ఎం.పి.పి సీనియర్ నాయకులు బోయిడి విఠల్,పార్డి మోహన్,వద్నం నగేష్,ప్రజాప్రతినిధులు కుబీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బిజెపి నాయకులు,అధికారులు ఉన్నారు.

# చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతి

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఛర్లీపూర్ గ్రామ శివారులో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇదే గ్రామానికి చెందిన చెట్టి వెంకటేష్ (25) అనే యువకుడు గోదావరి నదిలో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు. మృతుని తల్లి చెట్టి రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# గ్రామ అభివృద్ధి ప్రధాన ధ్యేయం

ప్రజాపక్షం /మల్లాపూర్ : తనను నమ్ముకుని గెలిపించిన రాఘవపేట ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉండి రాఘవపేట గ్రామాభివృద్ధి ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని సర్పంచ్ తోట శ్రీనివాస్ అన్నారు.ఈ సందర్భంగా గ్రామంలోని పలు కాలనీలో ఈజీఎస్ నిధులు 10 లక్షల రూపాయలతో సిసి రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి ఆదివారం పనులను ప్రారంభించి నిర్మాణం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వార్డు సభ్యుడు,మాజీ ఉప సర్పంచ్ అమీనుద్దీన్, గ్రామస్తులున్నారు.

# ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్‌తో వెంటనే కేసు నమోదు

ప్రజాపక్షం/మెట్‌పల్లి : వేంపేట్ గ్రామ శివారులో 21.03.2026 సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాల ప్రకారం, మగ్గిడి హరీష్ నడిపిస్తున్న బైక్‌పై వెళ్తున్న నీరటి రాజేశం (47) పెద్దమ్మ గుడి సమీపంలో బర్రెను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఇద్దరినీ మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, రాజేశం పరిస్థితి విషమంగా ఉండడంతో నిజామాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 22.03.2026 ఉదయం మృతి చెందాడు.ఈ ఘటనపై మృతుడి భార్య నిరటి లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు, బాధితులు ఉన్న చోటుకే వెళ్లి పోలీసులు ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మెట్‌పల్లి ఎస్ఐ. పబ్బ,కిరణ్ కుమార్ తెలియజేశారు.

# బిఆర్ఎస్ గ్రామ శాఖల అధ్యక్షుల ఎన్నిక

ప్రజాపక్షం/పెగడపల్లి : పెగడపల్లి మండలంలోని ఆరవెల్లి, వెంగళాయిపేట గ్రామల బిఆర్ఎస్ శాఖ నూతన అధ్యక్షులుగా గాలి పెల్లి సత్తయ్య, దావుల దేవయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆదివారం గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు లోకమల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి బండి వెంకన్నల అధ్యక్షతన నిర్వహించిన పార్టీ గ్రామ శాఖ ఎన్నికల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన సత్తయ్య, దేవయ్య మాట్లాడుతూ తమ పై నమ్మకముంచి ఈ బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కు, మండల పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు,తన వంతు కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు.పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాపక్షం /పెగడపల్లి : మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల వార్డు మెంబర్లకు పరిపాలనపై అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం ఆదివారం పెగడపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా ప్రారంభమైంది. మొదటి విడతగా నిర్వహించిన ఈ శిక్షణకు అయితుపల్లి,ఆరవెల్లి,బతికేపల్లి, దేవికొండ, దోమలకుంట,ఏదుమోటలపల్లి, కీచులాటపల్లి, లింగాపూర్,ల్యాగలమర్రి, మద్దులపల్లి ,మ్యాకవెంకయ్యపల్లి గ్రామాలకు చెందిన వార్డు మెంబర్లు ఉత్సాహంగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ట్రైనర్లు కదారి ప్రవీణ్, జి.మహేష్, ఎల్. శౌరి, బి. విద్యాసాగర్ లు వార్డు మెంబర్లకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.ముఖ్యంగా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 లోని ముఖ్యాంశాలను వివరిస్తూ గ్రామసభల నిర్వహణ, వార్డుల వారీగా అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన,ప్రభుత్వ పథకాల అమలులో ప్రజాప్రతినిధుల బాధ్యతలను క్షుణ్ణంగా విశ్లేషించారు. చట్టాలపై అవగాహన పెంచుకున్నప్పుడే గ్రామాల అభివృద్ధి వేగవంతం అవుతుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశి కుమార్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ అనుప్ కుమార్,మండల స్థాయి అధికారులు,కార్యదర్శులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి చేతుల మీదుగా ఉగాది పురస్కారం



ప్రజాపక్షం /పెగడపల్లి : హైదరాబాద్‌లో నిర్వహించిన పద్మశాలి టెక్స్‌టైల్స్ & లైఫ్ స్టైల్ ఎక్స్‌పో వేదికగా పెగడపల్లి మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు గాజుల గంగమల్లేశంకు పద్మశాలి సేవా పురస్కారం లభించింది.పద్మశాలి ఉగాది పురస్కారాలలో భాగంగా ఆయన సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మాజీ మంత్రి వర్యులు బాబు మోహన్, తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాళ్ళకాటి రాజకుమార్, తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్ కలిసి గంగమల్లేశంను శాలువాతో సత్కరించి, పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పద్మశాలి కుల బాంధవుల సంక్షేమం కోసం,వృత్తి పరమైన అభివృద్ధి కోసం గంగమల్లేశం చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.ఈ అవార్డు రావడం పట్ల పెగడపల్లి మండల పద్మశాలి సంఘం సభ్యులు మరియు కులస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# జ్ఞానోదయ కళాశాల 25వ వార్షికోత్సవ వేడుకలు

## ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే,చైర్మన్



ప్రజాపక్షం/మెట్‌పల్లి : పట్టణంలోని వీఆర్ ఎమ్ గార్డెన్స్‌లో జ్ఞానోదయ డిగ్రీ & పీజీ కళాశాల 25వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత 25 ఏళ్లుగా గ్రామీణ, పట్టణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ జ్ఞానోదయ కళాశాల విశిష్ట స్థానాన్ని సంపాదించిందన్నారు.కరస్పాండెంట్ ఇల్లందుల శ్రీనివాస్ కృషి వల్ల అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగారని ప్రశంసించారు.మున్సిపల్ చైర్మన్ లింబాద్రి మాట్లాడుతూ, కళాశాల అందిస్తున్న విద్యా సేవలు ప్రజలు ఎప్పటికీ మరవలేనివని అన్నారు.కరస్పాండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థలో చదివిన విద్యార్థులు ప్రభుత్వ,ప్రైవేట్, రాజకీయ రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పూర్వ,ప్రస్తుత విద్యార్థిని విద్యార్థులు,అధ్యాపకులు,అతిథులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు ప్రజా ప్రతినిధులకు సన్మానం



ప్రజాపక్షం/ మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణంలోని విదిత్ రెడ్డి గార్డెన్స్‌లో కోరుట్ల నియోజకవర్గ పటేల్స్ యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు ప్రజా ప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మున్నూరు కాపు రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్, జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ సమింద్ల వాణి శ్రీనివాస్, మాజీ జిల్లా పరిషత్ చైర్పర్సన్ దావా వసంత సురేష్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సుప్రీంకోర్టు న్యాయవాది కొమిరెడ్డి విజయ్ ఆజాద్, డాక్టర్ జెవిఎన్ వెంకట్, పిల్లల వైద్య నిపుణులు జె. గంగాసాగర్, జిల్లా అధ్యక్షుడు వద్దాల రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొమిరెడ్డి విజయ్ ఆజాద్ మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన మున్నూరు కాపు ప్రజా ప్రతినిధులు సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమాజ ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజా సేవలో ముందుండాలని ఆకాంక్షించారు.పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గంగాసాగర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు మెంబర్లు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లు, చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల అభివృద్ధి, వార్డుల అభివృద్ధితో పాటు గ్రామాలలో కి కొత్తగా వచ్చే వ్యక్తులపై కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే యువత గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా తగు చర్యలు తీసుకుని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన అ న్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ జె.వి.ఎన్. వెంకట్, డాక్టర్. పుప్పాల సాగర్ పటేల్, డాక్టర్ సంధ్యారాణి పటేల్, మెట్ప ల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, కౌన్సిలర్లు మా సుల ప్రవీణ్, నునుగొండ నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, చెదలు సత్యనారాయణ,ఏఐటీయూసీ. భ వన నిర్మాణ కార్మికుల సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షు డు.ఎశమేని గణేష్,మార్గం నరేష్, ఒజ్జల శ్రీనివాస్,పుప్పాల నాగేష్, నోముల రమేష్,జెట్టి రూపేష్, కోరుట్ల నియోజకవర్గ మున్నూరు కాపు కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణ కార్యక్రమాన్ని వార్డు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం: పంచాయతీరాజ్ చట్టంపై వార్డు సభ్యులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ప్రతి వార్డు సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు 5 రోజుల ఓరియెంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు.ఈ మేరకుఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టంపై పూర్తి అవగాహన అవసరమని,ఈ శిక్షణకు మండలంలోని అన్ని గ్రామాల వార్డు మెంబర్లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకుమాస్టర్ ట్రైనర్లు రాకేష్, రమేష్, రాజశేఖర్, రవి శిక్షణ అందిస్తారని, మొదటి బ్యాచ్‌లో 8 గ్రామాలకు చెందిన 79 మంది వార్డు సభ్యులు పాల్గొన్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వార్డు మెంబర్లు ,అధికారులు పాల్గొన్నారు.

# రైతు భరోసా నిధుల విడుదలతో రైతుల్లో ఆనందం

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : ప్రజా పాలనల రైతు ఉత్సవాల లో భాగంగా సీఎం కార్యక్రమాన్ని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో గోదూరు, వర్షకొండ, ఇబ్రహీంపట్నం రైతు వేదికలలో వ్యవసాయ అధికారులు లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ఆదివారం ప్రసారం చేశారు.ఈ సందర్భంగా సిద్దిపేట్ జిల్లా నర్మెట్ట గ్రామంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధుల విడుదల, ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పలు కార్యక్రమాల ప్రారంభోత్సవాలని రైతులు వీక్షించారు. అనంతరం రైతు సంక్షేమ పథకాల అమలుపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకట్‌రెడ్డి, సర్పంచ్ పోన్‌కంటి చిన్న వెంకట్,ఏఈవోలు,రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాపక్షం /పెగడపల్లి : మండలంలోని దోమలకుంట గ్రామంలోని గ్రామ పంచాయతి ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జగిత్యాల పట్టణంలోని జంబిగద్దె చౌరస్తాలో గల శ్రీపావని మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డా.శ్రీకాంత్ రెడ్డి యం.డి, డా.పావని రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో హాస్పిటల్ వైద్యులు దాదాపు 180మంది రోగులకు ఉచితంగా బిపి,షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బండారి మణెవ్వ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏమైనా వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్లు సంప్రదించాలన్నారు. తమ గ్రామానికి వచ్చి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేసిన వైద్యులు శ్రీకాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, హాస్పిటల్ సిబ్బంది ప్రభాకర్, జలేంధర్, నరేష్, లహరి, రమ్య,వివేక్,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



ప్రజాపక్షం/సుల్తానాబాద్: పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట రావు ప్రభుత్వం విప్ గా నియామకమైన సందర్భంగా సుల్తానాబాద్ మండలంలోని గొల్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బండారి రమేష్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేలు వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నో ఏండ్ల కల నెరవేర్చిన సర్పంచ్

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:**గత కొన్ని సంవత్సరాలుగా రోడ్ క్రాస్ వద్ద ప్రజలకు చేతికి అందే అంత ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రేగిడి మద్దికుంట గ్రామ ప్రజల తీవ్ర సమస్యను గ్రామ సర్పంచ్ బోయిని లావణ్య శ్రీనివాస్ పరిష్కరించారు. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం ప్రజలతో మమేకమై గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్న సర్పంచ్ లావణ్య శ్రీనివాస్ గ్రామ ప్రధాన సమస్య పరిష్కారం కోసం గ్రామస్తులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు క్రాస్ లైన్ వద్ద ఎలాంటి ప్రమాదం జరగకుండా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేసి సర్పంచిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప ఉపసర్పంచ్ మమతా వేణు, వార్డు సభ్యులు, లైన్మెన్ ఐలయ్య, ఏఎల్ఎం పృధ్వి విద్యుత్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## వైస్ చైర్మన్‌కు సన్మానం

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** సుల్తానాబాద్ స్వర్ణకారుల సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ వైస్ చైర్మన్ అంతటి పుష్పలత అన్నయ్య గౌడ్ ను ఆదివారం వారి నివాసంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమములో కందుకూరి ప్రకాష్, సత్తయ్య, ఈశ్వర చారి, ప్రభాకర్, కాసర్ల రాజమౌళి, ప్రదీప్,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరానగర్ తాగునీటి సమస్యకు పరిష్కారం

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని 3వ వార్డు ఇందిరానగర్ కాలనీలో దీర్ఘకాలంగా ఉన్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. కౌన్సిలర్ బత్తుల నరేష్ ఎన్నికల హామీ మేరకు కొత్త బోరు బావిని ఏర్పాటు చేయించారు.బోరును కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి ఆదివారం ప్రారంభించారు. కౌన్సిలర్ చర్యను నాయకులు అభినందించగా, కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్. కౌన్సిలర్ గుడికందుల అజయ్. ముఖీమ్.కాలనీవాసులు,తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణకు దిక్సూచి దీన్‌దయాల్..



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:**బిజెపి అంటే క్రమశిక్షణ అని పండిత్‌దీన్‌దయాల్ ప్రశిక్షణ కార్యక్రమంలో భాగంగా మండల బిజెపి అధ్యక్షులు రేపాకరాంచంద్రం అద్వర్యంలో పండిత్‌దీన్‌దయాల్ 24 గంటల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅథితులుగా రెడ్డబోయినగోపి హజరయ్యారు.కార్యకర్తలు బిజెపి కార్యకర్తలు క్రమశిక్షణతో ఉంటారని అన్నారు.నిబద్ధత అంటేనే భారతదేశంలోనే అత్యంత ప్రజాధారణ పొందినదని అన్నారు .జిల్లా ప్రధానకార్యదర్శి పొన్నాలతిరుపతి రెడ్డి,మద్దులబుగ్గారెడ్డి,ప్రభాకర్,నందినరేష్, కృష్ణహరి,కార్యకర్తలు వెంట ఉన్నారు.

# స్థానికులను పలకరించిన మంత్రి అడ్లూరి



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అ డ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ,ఆదివారం జగిత్యాల జిల్లా గొల్లప ల్లి మండలం వెనుగుమట్ల గ్రామంలో పర్యటనలో భాగంగా సామాన్య ప్రజలతో మమేకమై వారి మనసు గెలుచుకున్నారు.ఎండాకాలంలో వేసవి తాపానికి తట్టుకోలేక గ్రామస్తులు కొందరు చెట్ల నీడన కూర్చొని సేద తీరుతున్నారు.ఆ దారి గుంట వెళ్తున్న మంత్రి లక్ష్మ ణ్ కుమార్ చెట్ల కింద సేద తీరుతున్న వారిని చూడగానే తన కాన్వాయ్ ను ఆపి వాహనం నుంచి దిగి స్వయంగా వారి వద్దకు వెళ్లి అక్క ..అన్నా..ఎట్లా ఉన్నారు ? అంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించడంతో గ్రామస్తులు ఆశ్చర్యానికి ఆనందానికి లోనయ్యారు . సామాన్యులను చూసి వాహనం ఆపి మంత్రి మందలించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. అయితే సాక్షాత్తు మంత్రి తమ కళ్ళ ముందు కనిపించడం తో ఈ సందర్భంగా గ్రామస్తులు తమ వార్డు లో ఉన్న పలు సమస్యలను మంత్రికి దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా వా ర్డులో సిసి రోడ్డు నిర్మాణంతో పాటు కరెంటు పోల్స్ కావాలని మంత్రికి వివరించారు.ప్రజల సమస్యలను ఓపికగా ని న్న మంత్రి వార్డు సమస్యలపై స్పందించిన మంత్రి వెంటనే నిధులు మంజూరు చేసి సిసి రోడ్డు నిర్మాణం, నూతన కరెంటు పోల్స్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి హామీతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

# పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి




### పెండింగు బిల్లులు, పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న నిరసన

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** రిటైర్డ్ టీచర్ల పెన్షనరీ ప్రయోజనాల పెండింగ్ బిల్లులను ఏక మొత్తంలో విడుదల చేయాలని, టీచర్ల పెండింగు బిల్లులు, పీఆర్సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న జిల్లా కేంద్రంలో టిపి టిఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని టిపి టిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ధూమాల రమానాత్ రెడ్డి విక్కుర్తి అంజయ్య లు తెలిపారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మొత్తం రాష్ట్ర బడ్జెట్ రూ.3,24,234 కోట్లలో కేవలం విద్యారంగానికి 26,674 కోట్లు కేటాయించారని, ప్రస్తుత బడ్జెట్ లో గత సంవత్సర కేటాయింపులకు కేవలం 0.63 శాతం మాత్రమే పెంచి కేటాయింపులను 8.23 శాతం కుదించారన్నారు. విద్యా వ్యవస్థను సమూలంగా మారుస్తామని అట్టహాసంగా ప్రకటిస్తూ, ఉన్న స్కూళ్లను బలోపేతం చేయడం విస్మరించి ఇంటిగ్రేటెడ్ స్కూలంటూ, పబ్లిక్ స్కూలంటూ విద్యా కమీషన్ రిపోర్ట్ వచ్చిన తరుణంలో దిగువ స్థాయిలో విద్యా రంగానికి కేటాయింపులు జరపడం గర్హనీయం అన్నారు. అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి తక్కువ బడ్జెట్ను కేటాయించి ప్రకటిత విద్యా లక్ష్యాలను వమ్ము చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగ బలోపేతానికి కొఠారి కమీషన్ తో పాటుగా, అనేక మంది విద్యావేత్తలు, ఉపాధ్యాయ ఉద్యమ సంఘాలు బడ్జెట్ లో విద్యారంగానికి 30 శాతం కేటాయింపులు జరుపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం హామీని నిలబెట్టు కోకపోవడం శోచనీయం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం పాలకుల నిర్లక్ష్యం వల్ల 202122 లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న 27 లక్షల విద్యార్థుల సంఖ్య నేడు 16 లక్షలకు పడిపోయిందన్నారు. నాణ్యమైన విద్య, తరగతి గదుల నిర్మాణం, ఉపాధ్యాయుల నియామకం, భౌతిక వసతులు, సానిటేషన్, కంప్యూటర్, గ్రంథాలయాలు, స్పోర్ట్స్ అభివృద్ధి మొత్తం బడ్జెట్ కేటాయింపుల పైననే ఆధారపడుతుందన్నారు. తెలంగాణ విద్యా కమిషన్ రిపోర్ట్ ప్రకారం అత్యంత నిర్లక్ష్యానికి గురికాబడ్డ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలంటే ప్రభుత్వం ఈ బడ్జెట్లో విద్యారంగానికి 20 శాతం నిధులు కెటాయింపులు జరుపాలని కోరారు. ఈనెల 24న నిర్వహించే నిరసన కార్యక్రమానికి ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు నూగురి దేవేందర్ జిల్లా కార్యదర్శి చకినాల రామచంద్రం మండలాల అధ్యక్షులు బొజ్జ కృష్ణ, శ్రీనివాస్ చందుర్తి, సంజీవ్ , రుద్రంగి మండల అధ్యక్షులు బాలరాజు లు పాల్గొన్నారు.

# 41వ డివిజన్ ప్రధాన నాలా పునర్ నిర్మించండి

### డివిజన్ అభివృద్ధికి సహకరించండి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 41 డివిజన్ అభివృద్ధికి సహకరించాలని రాబోయే బడ్జెట్ సమావేశంలో డివిజన్ లోని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామికి విజ్ఞప్తి చేసిన సిపిఐ కార్పొరేటర్ మార్కపురి సూర్య తెలిపారు.రామగుండం కార్పొరేషన్ పరిధి 41 డివిజన్ లో ప్రధాన నాల దాదాపుగా ఒకటిన్నర కిలోమీటర్ల పొడవు ఉంటుందని ఇండ్ల మధ్యలో ఈ నాలా ప్రవహించడం వల్ల ఇది జామైనప్పుడల్లా ప్రజలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సూర్య అన్నారు. మొన్నటి ప్రజా పాలనలో 41 డివిజన్ కి నాలా శుద్ధి చేసే అవకాశం రాకపోవడం వల్ల మేయర్ ప్రత్యేక శ్రద్ధ చూపించి 41వ డివిజన్లోని నాలాను శుభ్రం చేయడానికి శానిటేషన్ విభాగానికి ఆదేశాలు జారీ చేయాలని సూర్య అన్నారు. అంతే కాకుండా 30 సంవత్సరాల క్రితం నిర్మించిన నాలా అనేక మూలమలుపులో డ్యామేజ్ అక్కడి ఇళ్లకు అక్కడి పునాదులకు తీవ్ర ఇబ్బందులు జరుగుతున్న క్రమంలో 41వ డివిజన్లోని ప్రధాన నాలను పునర్ నిర్మించాలని సూర్య డిమాండ్ చేశారు. అలాగే ఈ ప్రధాన నాలాకు ఉన్నటువంటి కనెక్టింగ్ నాలా చిన్న కాలువలు కొన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని వాటిపై కూడా దృష్టి పెట్టాలని మేయర్ ని కోరడం జరిగింది. 41వ డివిజన్లో కొంత ఖాళీ స్థలం ఉన్నందున అక్కడున్నటువంటి 150200 కుటుంబాలకు ఉపయోగపడే విధంగా ఒక కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన మహంకాళి స్వామి ఈ డివిజన్ పర్యటనకు వస్తానని అడిగిన వర్క్స్ చేపించడానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారనీ తెలిపారు.

## గాయత్రి విద్యానికేతన్‌లో కాన్వకేషన్ వేడుక

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** గాయత్రి విద్యానికేతన్‌లో యూకేజీ చిన్నారులు పూర్వ ప్రాథమిక విద్యను విజయవంతంగా పూర్తిచేసుకుని ప్రాథమిక విద్యలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కాన్వకేషన్ వేడుకను ఘనంగా నిర్వహించారు చిన్నారుల జీవితంలో మధురమైన జ్ఞాపకాలుగా నిలిచేలా ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పూర్వ ప్రాథమిక విద్య విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమం ఎంతో ఆనందభరితంగా సాగింది. చిన్నారులు తమ గురువులు, తల్లిదండ్రులు మరియు స్నేహితుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేస్తూ పాటలు పాడి, నృత్యాలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. వారి అమాయకమైన ఉపన్యాసాలు, ప్రదర్శనలు హాజరైన వారిని మంత్రముగ్ధులను చేశాయి.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, యూకేజీ ఉపాధ్యాయులు, కరస్పాండెంట్ రజనీ దేవి, ప్రిన్సిపల్ విజయ్ మరియు గాయత్రి విద్యానికేతన్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.అందరి సమక్షంలో వేడుక విజయవంతంగా ముగిసింది.

## ప్రపంచంలోనే మహోన్నతమైన వ్యక్తి అంబేద్కర్

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో సామజిక సేవ కార్యకర్త గంగాధర మధుసూదన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబేద్కర్ నామ స్మరణం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణానికి చెందిన మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కట్ట మహేష్ పాల్గొని మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళిలు అర్పించారు.ఈ సందర్భంగా కట్ట మహేష్ మాట్లాడుతూ అంబేద్కర్ మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్నూరు సంఘం సీనియర్ నాయకులు,ప్రజా సంఘాల జెఎసి జిల్లా నాయకుడు బోనగిరి మల్లారెడ్డి,సంఘము ఉపాధ్యక్షుడు పడాల చిన్న సత్యం ,సంఘం ప్రధాన కార్యదర్శి బోనగిరి పవన్,కోశాధికారి పడాల పెద్ద సత్యం,అనుముల లింగయ్య,బోనగిరి వెంకటేష్,కొత్త తిరుపతి,ముదాం శ్రీనువాస్, కట్ట సత్తన్న,గంగుల యాదగిరి, భీమ గారి చందు, ముద్దం సురేష్,భీమ శ్రీనివాస్, బోనగిరి వెంకటేష్ కందుకూరి మల్లేష్,కందుకూరి శ్రీను,జైన పాట కిషన్,పడాల తిరుపతి, పడాల సుదర్శన్,బోనగిరి నాగరాజ్,లక్కాకుల శ్రీను, కట్ట రవి, సంఘ సభ్యులు అనోజ్, బోనగిరి అనిల్, పడల రాజు,భీమ మహేష్,రాచూరి రత్నాకర్,గ్రామస్తులు శాతల్ల లక్ష్మ ణ్,పొన్నగంటి రాజరత్నం,తదితరులు పాల్గొన్నారు.

## దంత సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** దంత సమస్యలను నిర్లక్ష్యం చేస్తే గుండె సంబంధిత వ్యాధులకు దారి తీసే ప్రమాదం ఉందని జగిత్యాలకు చెందిన సృజన డెంటల్ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ వనిత అన్నారు.ఆదివారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని మల్లన్నపేట గ్రామంలో డా. సృజన డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరానికి సుమారు వందమంది గ్రామ ప్రజలు దంత వైద్య పరీక్షలకు హాజరు కాగా డాక్టర్ వనిత వారికి దంత వైద్య పరీక్షలు నిర్వహించి నోటి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వైద్యులు వనిత మాట్లాడుతూ ప్రతిరోజూ దంత పరిశుభ్రత పాటించడం,క్రమం తప్పకుండా డెంటల్ చెకప్ చేయించుకోవాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆరోగ్య శిబిరాలను మరింతగా నిర్వహించేందుకు నిర్వాహకులు సంకల్పం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిద్దెంకి లక్ష్మీ మల్లారెడ్డి , నాయకులు అవారీ చందు,కడమండ వెంకటి,గ్రామ యువకులు,ప్రజలు, మాన్‌కైండ్ ప్రతినిధి దాసరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం వితరణ..

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:**ఇటీవల మండలకేంద్రానికి చెందిన బాలమహేందర్ అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న అమ్మఫౌండేషన్ అధ్యక్షులు యాభై కిలోల బియ్యం ఆదివారం ఆకులమురళీమోహన్ వితరణ చేశారు.ఆయనతో ఉన్న రాయిని సత్తవ్వ రెండువేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.వెంట రమేష్,శ్రీనివాస్,సందీప్,సన్నీ,శివరామకృష్ణ ఉన్నారు.

# బడ్జెట్‌లో నేతన్నలకు వివక్ష

బిఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య,

పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** బడ్జెట్ కేటాయింపులో నేతన్నలకు వివక్ష చూపించారని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య పట్టణ అధ్యక్షుడు చక్రపాణి లు మండిపడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్లో విలేకరుల సమావేశం నిర్వహించి తెలంగాణ బడ్జెట్ ను వ్యతిరేకించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దగాకోరు బడ్జెట్,రాష్ట్ర ప్రజలను మోసం చేసే బడ్జెట్ అని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు 11 డిక్లరేషన్లు, 420 హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి ఎన్నికల తర్వాత వీటన్నింటినీ తుంగలో తొక్కారని మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తానని, 42 శాతం రిజర్వేషన్ ఇస్తానన్న హామీలు ఏమయ్యాయనీ ప్రశ్నించారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలలో బీసీలకు తీరని అన్యాయం చేశారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ధైర్యం ఉంటే రాష్ట్ర బీసీ జనాభా దామాషా ప్రకారం పోయిన సంవత్సరం ఇస్తానన్న బడ్జెట్ ఈ సంవత్సరం బడ్జెట్ కలిపి 50 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి బీసీల పట్ల చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. రైతన్న తరువాత నేతన్న అని కెసిఆర్ గుర్తించారని, నేతన్నకే బడ్జెట్ కేటాయింపులో బిఆర్ఎస్ ప్రభుత్వంలో 1200 కోట్ల బడ్జెట్ ను కేటాయిస్తే కాంగ్రెస్ ప్రభుత్వంలో 400 కోట్ల బడ్జెట్ పెట్టి 250 కోట్లకు కుదించిన విషయం చూస్తే నేతన్నలపై ఎలాంటి ప్రేమ ఉందో అర్థమవుతుందని అన్నారు. బి ఆర్ ఎస్ ప్రభుత్వం నేతన్నలకు 8,000 కూలి నుండి 16 వేలకు పెంచారని గుర్తు చేశారు. గతంలో ఆసాములు 86 రూపాయల కూలి ఇస్తే ఇప్పుడు అది 62 రూపాయలకు తగ్గించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదని విమర్శించారు. గత ప్రభుత్వం నేతన్నలకు 6 నెలల పని మాత్రమే కల్పించిందని మేము 365 రోజులు పని కల్పిస్తామన్న మాట ఏమైందన్నారు. ఇచ్చిన 6 గ్యారెంటీలు అమలు చేయకుండా ప్రజలకు కల్లబొల్లి మాటలు చెబుతూ ముందుకు వెళ్తున్నారని మండిపడ్డారు. ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని సిరిసిల్లలో మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని అన్నారు. కాళేశ్వరం నీళ్లను సిరిసిల్ల ముంగిటికి తీసుకొచ్చిన ఘనత కేటీఆర్ ది అన్నారు. చేపల పెంపకం కోసం ఆక్వా హబ్ ఏర్పాటు చేయడానికి స్థల సేకరణ చేపడితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిన దాని ఊసే లేదన్నారు. కెసిఆర్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు చుట్టుపక్కల భూములను ఫార్మా సిటీకి కేటాయిస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రియల్ ఎస్టేట్ ముసుగులో ఫార్మా రంగాన్ని వెనక్కి నెట్టేసి బినామీలకు ఇస్తున్నారన్నారు. రైతులకు సన్న వడ్ల బోనస్, ఉగాది దాటిన రైతు భరోసా రైతుల ఖాతాలో వేయలేదని మండిపడ్డారు. దేశంలో పద్ధతి లేకుండా ప్రభుత్వాన్ని నడుపుతున్న ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు ప్రజల పక్షాన బిఆర్ఎస్ ప్రభుత్వం ఉండి పోరాటం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో దార్ల సందీప్, మంచే శ్రీనివాస్, దారుణం లక్ష్మీ నారాయణ,గుండ్లపల్లి పూర్ణ, గెంట్యాల శ్రీనివాస్, మ్యాన రవి, బొల్లి రామ్మోహన్, సబ్బని హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ స్వాములకు అన్నప్రసాద వితరణ



**ప్రజాపక్షం / మందమర్రి :** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని పంచముఖి హనుమాన్ దేవాలయంలో ఆదివారం హనుమాన్ మాలధారణ స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. మాజీ ప్రభుత్వ విప్, మాజీ చెన్నూర్ శాసనసభ్యులు నల్లాల ఓదెలు, మాజీ జిల్లా జడ్పి చైర్పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నల్లాల ఓదెలు దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మాజీ ఎంఎల్ఏ నల్లాల ఓదెలు మాట్లాడుతూ స్వామివారి కృపాకటాక్షాలతో తాము ఆరోగ్యంగా ఉన్నన్ని రోజులు ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. భక్తిభావంతో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమంలో మాలధారణ స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పిఎస్ఆర్ క్రికెట్ లీగ్ ప్రారంభం

**ప్రజాపక్షం/శీరాంపూర్ :** మంచిర్యాల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ప్రేమ్ సాగర్ రావు యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిఎస్ఆర్ క్రికెట్ లీగ్ సీజన్1 ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్నీ మధుకర్ ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసి జెర్సీలను ఆవిష్కరించారు. అనంతరం మైదానంలో క్రీడాకారులను పరిచయం చేసుకుని, వారితో కలిసి బ్యాటింగ్ చేసి ఉత్సాహపరిచారు. యువత క్రీడల్లో రాణించాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వేల్పుల రవీందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కాంగ్రెస్ నాయకులు అటకాపురం సతీష్, నరిగె నరేష్, టోర్నమెంట్ నిర్వాహకులు రజనీకాంత్, శేఖర్, భీమిని రాజేష్, సురేష్, లక్ష్మణ్, వెంకటేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## యువకుడి హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

పట్టణ సిఐ ప్రమోద్ రావు



**ప్రజాపక్షం/మంచిర్యాల :** మంచిర్యాల కాలేజీ రోడ్డులో ఈనెల 19న జరిగిన దీపక్ (35) అనే యువకుడి హత్య కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ ప్రమోద్ రావు తెలిపారు. ఆదివారం మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. యువకుడి హత్యత కేసులో కాసిపేట మండలం పల్లంగూడకు చెందిన భీమిని సంజీవ్ (28), మహారాష్ట్రలోని ఆహెరికి చెందిన సీడం దీపక్ (37)ను అదుపులోకి తీసుకొని, నిందితుల వద్ద నుండి హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితులను మంచిర్యాల కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని అన్నారు. నిందితులను పట్టుకోవడంలో లక్షెట్టిపేట సిబ్బంది కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు.

## కాంగ్రెస్ జిల్లా కమిటీ నియామకాల్లో అసంతృప్తి జ్వాలలు

**ప్రజాపక్షం / తిర్యాణి :** టిపిసిసి ఇటీవల ప్రకటించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ నియామకాలు తిర్యాణి మండలంలో తీవ్ర కలకలం రేపాయి. సీనియర్ నాయకులను పూర్తిగా పక్కనబెట్టి అనుభవం తక్కువ ఉన్న వారికి పదవులు కట్టబెట్టారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడి పనిచేసిన తమను విస్మరించడం పట్ల పలువురు నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేటాయించిన ఎగ్జిక్యూటివ్ పోస్టులు కేవలం పేరుకే పరిమితమయ్యాయని, అసలు గుర్తింపు లేదని వారు విమర్శిస్తున్నారు. ఇలాంటి పదవులు మాకొద్దు అంటూ కొందరు నాయకులు బహిరంగంగానే అసంతృప్తిని వెళ్లగక్కుతుండగా, మరికొందరు రాజీనామాలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కమిటీ ఏర్పాటుకు ముందు జిల్లా, మండల స్థాయి నాయకులను సంప్రదించకపోవడం పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసింది. మండలాల్లో పార్టీ కార్యక్రమాల నిర్వహణలో సమన్వయం పూర్తిగా లోపించిందని కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ స్థాయిలో అసంతృప్తి బహిర్గతం కావడం ఇదే తొలిసారి.

ఉమ్మడి జిల్లా స్థాయి నాయకులతో చర్చించకుండా కమిటీలు వేయడం అంతర్గత ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసిందని వారు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని 54 మండలాలకు కమిటీలు ప్రకటించినప్పటికీ కొందరికే ప్రాధాన్యం ఇవ్వడంపై మండల నాయకులతో పాటు పలువురు సీనియర్లు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ హైకమాండ్ వెంటనే జోక్యం చేసుకోకపోతే రాజీనామాలు, నిరసనలు తప్పవని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## తాటిగూడలో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం / కాసిపేట :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని తాటిగూడ గ్రామపంచాయతీలో 18.50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు ఆదివారం గ్రామ సర్పంచ్ మడావి వెంకటేష్ భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల చిరకాల కోరిక మేరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల కింద మంజూరు చేసి రోడ్డు పనులకు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, దీని ద్వారా అంతర్గత రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని తెలిపారు. పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తమ్మినేని విజయలక్ష్మి, శ్యామ్ శేఖర్, పంచాయతీరాజ్ జెఇ జగన్, మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, ఆత్మ కమిటీ చైర్మన్ రౌతు సత్తయ్య, ఉపాధ్యక్షుడు ముత్యాల రాజమౌళి, ప్రధాన కార్యదర్శి మైదా రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గోలేటి స్వామి పాల్గొన్నారు.

## సింగరేణిలో గుర్తింపు సంఘం ద్వంద్వ నీతి

ఐఎన్‌టియుసి కేంద్ర ఉపాధ్యక్షుడు

కాంపెల్లి సమ్మయ్య



**ప్రజాపక్షం/మందమర్రి :** సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి రెండేళ్లు గడుస్తున్నా గెలిచిన సంఘం ఇంకా ప్రతిపక్ష పాత్రనే పోషిస్తోందని ఐఎన్‌టియుసి కేంద్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య విమర్శించారు. మందమర్రి పట్టణంలోని ఐఎన్‌టియుసి కార్యాలయంలో ఆదివారం జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్ట్రక్చర్ మీటింగ్‌లలో పాల్గొని సంస్థ అభివృద్ధికి సహకరించాల్సింది పోయి కాలయాపన చేస్తూ ఐఎన్‌టియుసిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్మికుల హక్కుల కోసం పోరాడుతామని చెబుతూనే యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. గత తొమ్మిది నెలలుగా గుర్తింపు పత్రాన్ని తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వ మంత్రులతో తిరుగుతూ ప్రభుత్వాన్ని విమర్శించడం సదరు సంఘం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిపక్షంగా ఉండి సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉంటూ రెండు నాలికల ధోరణి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. కార్మిక హక్కుల సాధన కోసం అన్ని సంఘాలు ఏకమై యాజమాన్యంపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు దేవి భూమయ్య, వై సత్యనారాయణ, రాపర్తి శ్రీనివాస్, భీమరపు సదయ్య, నూనె సాంబయ్య, కొప్పుల బాపు, కిషోర్ పాల్గొన్నారు

## పంచాయతీ పాలనపై వార్డు సభ్యులకు అవగాహన



**ప్రజాపక్షం/ సిర్పూర్ టి :** గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం సిర్పూర్ టి మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. పంచాయతీ పరిపాలన విధానం, నిధుల వినియోగం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో వార్డు సభ్యులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామాల ప్రగతికి ఇటువంటి శిక్షణా తరగతులు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. ఉదయం 9:30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ట్రైనర్లు తుకారాం, తిరుపతి, రమేష్, సంతోష్, రఘు కుమార్ శిక్షణ అందించారు. వార్డు సభ్యుల విధులు, గ్రామ సభల నిర్వహణ, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ వంటి అంశాలపై సభ్యులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## గేట్ ఫలితాల్లో మెరిసిన సంజయ్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ మండలంలోని కొత్త పోచంపాడ్ గ్రామానికి చెందిన(శ్రీనగర్ ) చింతల సంగీ తరవీందర్ దంపతుల కుమారుడు చింతల సంజయ్ ఇటీవల వెల్లడైన ఆల్ ఇండియా గేట్ సివిల్ ఇంజనీరింగ్ ఫలితాల్లో 432 స్కోర్ సాధించి ప్రతిభ కనబరిచాడు.ఈ విజయంతో కుటుంబ సభ్యులు,బంధువులు,కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.ఆదివారం శ్రీనగర్‌లోని ఆలయ నివాసంలో రవీందర్ మిత్రులు సంజయ్‌ను శాలువా కప్పి,పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సంజయ్ కృషి,పట్టుదల,నియమం విజయానికి కారణమని పలువురు అభినందించారు.గ్రామ యువతకు ఆయన ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు.సంజయ్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం,గురువుల మార్గదర్శకతతోనే ఈ ఫలితం సాధ్యమైందని తెలిపారు.భవిష్యత్తులో మరింత ఉన్నత చదువులు అభ్యసించి దేశానికి ఉపయోగపడే ఇంజనీర్‌గా ఎదగాలని తన లక్ష్యమని చెప్పారు.ఈ కార్యక్రమంలో గుమ్ముల అశోక్,తాటికొండ స్వామి, మిత్రు లు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## బాసర 5 అంగన్వాడీ కేంద్రాన్ని మంజూరు చేయించిన ఎమ్మెల్యే

రామారావు పటేల్..

**ప్రజాపక్షం/బైంసా:**బైంసా ఎమ్మెల్యే నివాసంలో స్థానిక బాసర గ్రామ యువకులు తో పాటు అంగన్వాడీ టీయకం ఎస్పి కాలనీలో అ ంగన్వాడీ కేంద్రం లేదు.చిన్నపిల్లలకు అద్దె ఇంట్లో చాలా ఇబ్బంది అవుతుంది.మాకు అంగాన్వాడీ కేంద్రం భవనాన్ని మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు గ్రామం యువకులు అడగగానే వెంటనే పంచాయతీ రాజ్ ఎఈ తో మాట్లాడి భవన నిర్మాణ మంజూరు చేయడం జరిగింది.బాసర ఎస్పి కాలనీ గ్రామ యువకులు రామారావు పటేల్‌కి హృదయపర్వక ధన్యవాదాలు తెలియజేశారు.కార్యక్రమంలో ఐదవ అంగన్వాడీ కేంద్రం టీచర్ అల్లం అరుణ,వార్డ్ మెంబర్‌గా పోటీచేసని గద్దల వెంకట్, పిరాజ్,పాల్గొన్నారు.

## మున్నూరు కాపులు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో వృద్ధి సాధించాలి

మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి..




**ప్రజాపక్షం/బైంసా:**మున్నూరు కావులు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని బైంసా మున్సిపల్ చైర్మన్ తుమొల్ల దత్తాత్రి సూచించారు.ఆదివారం బైంసా లోని గణేష్‌నగర్ మున్నూరు కావు సంఘ భవనంలో తాలుకా మున్నూరు కావు హడ్ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైనా ప్రజాప్రతినిధులకు సన్మానం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బైంసా లో తాలుకా స్థాయి మున్నూరు కాపసు సంఘ భవనానికి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సహకారం తో స్థలాన్ని ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు.అందరు కలిసి ఉండి తాలుకా సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు హడ్ కమిటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.అందరు ఒకటై సంఘాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు.రాజకీయం,విద్య రంగం,వ్యాపారం,వ్యవసాయం అన్ని రంగాల్లో వృద్ధి సాధించి అర్థికంగా మరింత ముందుకు సాగాలన్నారు.కార్యక్రమనికి నూతనంగా ఎన్నికైనా సర్పంచ్‌లు,వార్డు సభ్యులు నియోజకవర్గం లోని ఆయా గ్రామాల నుండి పెద్ద మొత్తంలో తరలి వచ్చారు.కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బి.గంగాధర్,మాజీ తాలుకా సంఘం అధ్యక్షుడు మెంచు గంగయ్య,మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జుట్టు అశోక్,డాక్టర్ పోశెట్టి,హడ్ అక్ కమిటీ సభ్యులు ఏనుపోతుల మల్లేష్,పెండపు కాశినాథ్,కొట్టె హన్మాండ్లు,రిటైర్డ్ అధికారులు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## శనగ పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/తానూర్:**మండల కేంద్రంలోని డాంగేపల్లి గోదాంలో నూతనంగా ఏర్పాటు చేసిన శనగ పంట కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ప్రారంభించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ,రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోకుండా,ప్రభుత్వం కల్పించే మద్దతు ధర 5875 క్వింటాలుకు మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సోసైటీ చైర్మన్ నారాయణరావు పటేల్, సిఇఒ సాయరెడ్డి, ఎఒమనిషా,బిజెపి మండల అధ్యక్షుడు లక్ష్మ ణ్ రెడ్డి,మాజీ అధ్యక్షుడు చిన్నారెడ్డి,నాయకులు శివాజీ పటేల్,మండల సర్పంచులు,ప్రజాప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌తో ప్రభుత్వం మరోసారి మోసం..

**ప్రజాపక్షం/ఖానాపూర్:**రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ పేరుతో ప్రజలను మరోసారి మోసం చేసిందని ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ ఆరోపించారు.



గతంలో కేటాయించిన బడ్జెట్ లో 40 శాతం అయన ఖర్చు చేయలేదని,ఇందులో అంకెల గారడీ తప్ప అభివృద్ధి ఏ మాత్రం లేదని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బడ్జెట్‌లో ఎస్సి, ఎస్టిల అభివృద్ధికి ప్రభుత్వం వద్ద స్పష్టమైన కార్యాచరణ లేదన్నారు.ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం విద్యార్థులు,రైతులు,నిరోద్యోగులతో పాటు అన్ని వర్గాలను ప్రభుత్వం ముడోసారి మోసం చేసిందన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు గుణపాఠం చేప్తారని విమర్శించారు.

## బస్సు డిపోకు మంచిరోజులు వచ్చేనా...

**ప్రజాపక్షం/నందిపేట్:** నందిపేట్ మండల కేంద్రంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్మించతలపెట్టిన బస్సు డిపోకు మంచిరోజులు రానున్నాయా. దీని గురించి ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేస్ రెడ్డి ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాలలో ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి దృష్టికి తెచ్చారు. వారు సానుకూలంగా స్పందించారు. త్వరలో సర్వే చేయమని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యేద్వారా తెలిసింది. 1994లో మండలంలో ఇంటికి ఐదు రూపాయలు వసూలు చేసి 5.39 గుంటల స్తలం కొన్నారు. అప్పుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రశేకర్‌రావు శంకుస్తాపన చేసి మరిచి పోయారు. దాదాపు ముప్పై ఏళ్లు గడిచాయి. పట్టించుకునే వారు కరువయ్యారు. స్తలం చుట్టు ప్రహరీ గోడ ఆర్‌టిసి నిర్మించి వదిలేశారు. కోళ్ళ చెత్త, పిచ్చిమొక్కలు మొలవడంతో పోరాట కమిటి మొన్న బంద్ నిర్వహించి నిరసన తెలిపింది. మా స్తలం మాకు ఇవ్వండి లేదా డిపో నిర్మించండి అంటు హైకోర్టును ఆశ్రయింఆరు. దీంతో ఆర్మూర్ ఎమ్మెల్యే 12 సార్లు మంత్రిని కలిసినా ఫలితం కానరాలేదు. పోరాట కమిటి బంద్ వల్ల ప్రభుత్వం స్పందిస్తుందా చూడాలి. ఎమ్మెల్యే పోరాటం ఆగడం లేదు. బస్సుల కొరత, హైదరాబాద్ బస్సు నిలిపివేయడం వల్ల ప్రజలకు ఇబ్బంది ఎదురవుతుంది. ఒకవేళ బస్సు డిపో నిర్మిస్తే పలు గ్రామాలకు సకాలంలో బస్సులు ఉంటాయి. ఇక్కడి నుంచే హైదరాబాద్, భైంసా, బోధన్, నిజామాబాద్ ఇతర ప్రాంతాలకు బస్సులు నడుస్తాయి. ఆదాయంలో మంచి రూటు అని ఆర్‌టిసిలో నందిపేట్ పేరుఉంది. ఎమ్మెల్యే పోరాటానికి మంచిరోజులు రావాలని కోరుకుందాం.

## వెలమ సంఘం కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:**నిర్మల్ జిల్లా పద్మనాయక వెలమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.పట్టణంలోని ఆదర్శనగర లో గల సంఘ భవనంలో జరిగిన ఈ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి డిసిసి మాజీ అధ్యక్షుడు కే.శ్రీహరి రావు,ప్రధాన కార్యదర్శిగా బీరవెల్లి తిరుమల్ రావు,ఉపాధ్యక్షుడిగా కే.సుశీల్ కుమార్,కే.విలాస్ రావు,కోశాధికారిగా ఎస్.విఠల్‌రావు,ఆర్గనైజింగ్ సెక్రటరీగా కే.రామచందర్ రావు,సంయుక్త కార్యదర్శులుగా నవీన్ రావు,యం.వెంగళరావు,ప్రచార కార్యదర్శిగా ఎం.మహేష్ రావు న్యాయ సలహాదారిగా వై.రమణరావు లను ఎన్నుకున్నారు.అలాగే ఈసీ మెంబర్లుగా పి.రజనీకాంత్,కే.కృష్ణారావు,ఎన్.ప్రవీణ్ కుమార్,ఎస్.మురళీధర్ రావు,ఎస్.శ్రీధర్ రావు,సిహెచ్ కమలాకర్‌రావు,నవ్వలను ఎన్నుకున్నారు.కాగా నూతన కార్యవర్గంచే ఎన్నికల అధికారిగా వ్యవహరించిన బి.కిషన్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కే.శ్రీహరి రావు మాట్లాడుతూ..నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.సంఘం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.అంతకుముందు మాజీ అధ్యక్షుడు చిక్యాల భాస్కరరావు మాట్లాడుతూ గత పాలకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వెలమ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాకారం పౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం..

**ప్రజాపక్షం/నేరడిగొండ :**మండలంలోని వాడూర్ గ్రామంలో ఆదివారం ఆడే సాకారం ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆడే సతీష్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ హాస్పిటల్ సౌజన్యంతో మెగా వైద్య శిభిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరనికి ముఖ్య అతిథిగా బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్,పాల్గొని ప్రారంభించారు.అనంతరం అయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.పేద ప్రజలు ఖరీదైన వైద్య సేవలు పొందలేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని అన్నారు.ఈ మెగా వైద్య శిబిరంలో వైద్యులు క్రాంతి కుమార్(జనరల్ మెడిసిన్),రంజిత క్రాంతి(గైనకాలజిస్ట్),విజయ్‌మోహన్ రాజ్(న్యూరో సర్జన్),రాజేందర్ రూపావత్(జనరల్ సర్జన్),కృష్ణ ప్రసాద్ చౌహన్,(అప్తమాలాజిస్ట్)దివ్యజ్యోతి చౌహన్(పిల్లల వైద్యులు),వివిధ రకాల పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆడేపు శ్రీకాంత్,నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి,యండి సద్దాం,తదితరులు పాల్గొన్నారు.

## బోథ్ కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం మంజూరు..



**ప్రజాపక్షం/బోథ్ :**బోథ్ మండల ప్రజల చిరకాల కోరిక అయిన అగ్నిమాపక కేంద్రం స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం పట్ల బోథ్ మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ప్రజా ప్రభుత్వంలో ప్రజా పాలనను సమర్థంగా కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో,ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ ఈ కీలక నిర్ణయం తీసుకోవడం అభినందనీయం బోథ్ నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆదేగజేందర్ అన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్నిమాపక కేంద్రం మంజూరుకు సహకరించిన జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుకి,మాజీ కేంద్ర మంత్రివేణుగోపాల చారికి,రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి,డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్,మాజీ ఎంపీ సోయం బావు రావుకి కృతజ్ఞతలు తెలిపారు.ఈ అగ్ని మాపక కేంద్రం స్థాపనతో బోథ్ పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సేవలు అందుబాటులోకి రావడం ద్వారా ప్రజల ప్రాణ,ఆస్తి రక్షణ మరింత బలపడుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ ఆత్మచైర్మన్ గోర్ల రాజు యాదవ్,బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్,ఆత్మడైరెక్టర్ రహీముద్దీన్,మెరుగూ నరసింహ దాస్,చట్ల ఉమేష్,మొహమ్మద్,అబ్రార్ అలపాటి అచ్చుతానంద రెడ్డి,పన్నాల శ్యామేందర్, డీసీసీ కార్యదర్శి వినయ్ రెడ్డి,యూసుఫ్ ఖురేషీ,సామ వినోద్ రెడ్డి, బోథ్ వార్డు సభ్యులు రాయల్ తిరుపలి,పద్మారావు పాల్గొన్నారు.

## గణితం ఇక గమ్మత్తు.. భయం వీడి అభ్యాసం వైపు అడుగులు

విద్యార్థుల్లో పెరిగిన తార్కిక ఆలోచన

పూర్వ విద్యార్థి కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు





**ప్రజాపక్షం/ఎడపల్లి:**సాధారణంగా గణితం అంటే విద్యార్థుల్లో ఒక రకమైన భయం ఉంటుంది. కానీ ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ క్యాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాత్రం గణితం అంటే ఇప్పుడు అత్యంత ఇష్టమైన సబ్జెక్టు దీనికి కారణం అక్కడ ఏర్పాటు చేసిన అత్యాధునిక గణిత ప్రయోగశాల. ఈ ల్యాబ్ ఏర్పాటు మార్చి 15తో విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

**దాతృత్వంతో వెలిసిన విజ్ఞాన కేంద్రం...**

జిల్లాలోనే మరెక్కడా లేని విధంగా ఈ పాఠశాల పూర్వ విద్యార్థి కృష్ణారెడ్డి అందించిన ఆర్థిక సహాయంతో ఈ గణిత ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. తమ పాఠశాల విద్యార్థులు గణితంలో రాణించాలనే ఉద్దేశ్యంతో ఆయన చేసి ఈ సాయం ఇప్పుడు వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతోంది.

**మెరుగుపడిన ఫలితాలు... పెరిగిన హాజరు**

గణిత ల్యాబ్ ఏర్పాటు తరువాత విద్యార్థుల ప్రవర్తనలో అభ్యాసనలో గణనీయమైన మార్పులు వచ్చాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రజినీ కుమారి తెలిపారు. బోధనోపకరణాల ద్వారా గణితాన్ని బోధించడం వల్ల అమూర్త భావనలు సైతం విద్యార్థులకు సులభంగా అర్థమవుతున్నాయి. దీని వల్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరిగి, పాఠశాలకు హాజరు శాతం కూడా గణనీయంగా పెరిగింది. ఈ ల్యాబ్ కేవలం మా పాఠశాలకే పరిమితం కాకుండా జిల్లాలోని ఇతర ఉపాధ్యాయులకు శిక్షణ కేంద్రంగా కూడా ఉపయోగపడటం గర్వకారణమని ఆమె పేర్కొన్నారు.

**ప్రయోగాత్మక బోధనతో మెదడుకు పదును...**

గణితం కేవలం అంకెలే కాదు, అదొక తార్కిక ఆలోచన అని నిరూపిస్తున్నామని గణిత ఉపాధ్యాయులు ఎం.సాయిలు తెలిపారు. విద్యార్థులు సమూహాలుగా ఏర్పడి చర్చించుకోవడం, ప్రయోగాలు చేయడం వల్ల వారిలో ప్రశ్నించే తత్వం పెరిగిందన్నారు.



**జి.అమూల్య(పదో తరగతి)**

గతంలో మాకు గణిత ల్యాబ్ ఏంటో కూడా తెలియదు. ఇక్కడ ల్యాబ్ ఏర్పడిన తరువాతే మాకు గణితంపై భయం పోయి ఇష్టం కలిగింది. ఇది మా అదృష్టంగా భావిస్తున్నాం.

**ఎస్.రఘురామ్(పదో తరగతి)**

మాస్టారు పరికరాల ద్వారా చూపిస్తూ పాఠాలు చెప్పడం వల్ల అవి కళ్లకు కట్టినట్లు ఉండి, ఎప్పటికీ గుర్తుండిపోతున్నాయి. ఇప్పుడు గణితం నేర్చుకోవడం చాలా సులభంగా అనిపిస్తుంది.కేవలం ఈ పాఠశాల విద్యార్థులే కాకుండా, మండలంలోని ఇతర పాఠశాల ఉపాధ్యాయులు కూడా ఇక్కడ శిక్షణ ఇవ్వడం ఈ ల్యాబ్ ప్రత్యేకత. ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి వసతులు కల్పిస్తే విద్యార్థులు అద్భుతాలు సాధిస్తారని ఈ రెండేళ్ల ప్రయాణం నిరూపించింది.

